తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

ఆదివారం / 11.02.2024

తెలంగాణ రాష్ట్ర చిహ్నం మార్పుపై స్పందించిన కేటీఆర్..

తెలంగాణ వీణ , హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వ తొలి రాష్ట్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉందన్నారు మాజీ మంత్రి కేటీఆర్. హైదరాబాద్ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణ భవన్‌లో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా సిటీ, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుల రద్దుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇవి హైదరాబాద్ ప్రగతికి ముఖ్యమైన ప్రాజెక్టులు. అయితే, ఈ ప్రాజెక్టులను రద్దు చేయాలనే ఇటీవలి నిర్ణయం రాష్ట్ర ఆదాయంలో క్షీణతకు దారి తీస్తుంది "అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ అభివృద్ధిని, పురోగతిని అడ్డుకుంటున్నదని ఆరోపించారు. "అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా దృష్టి పెట్టారన్నారు. ఈ ప్రయత్నాలను ప్రజలు ఇకపై నమ్మరు" అని విమర్శించారు.జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో పాటు రోజువారీ కార్యకలాపాల్లో జీహెచ్ఎంసీ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలందించేందుకు పాలకమండలి, ఎన్నికైన కార్పొరేటర్లు తమ అధికారాలను వినియోగించుకోవాలని కోరారు. "జీహెచ్ఎంసీ అనేది రాజ్యాంగం ద్వారా స్థాపించబడిన ఐదు అంచెల పరిపాలన వ్యవస్థలో భాగంగా ఏర్పడిన స్థానిక ప్రభుత్వం అని గుర్తుంచుకోవాలి" అని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం స్థానంలో కొత్త చిహ్నాన్నిపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూడా కేటీఆర్ తప్పుబట్టారు . "కాంగ్రెస్ టీఎస్‌ని టీజీగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. అలాగే కాకతీయ శిలాతోరణం, చార్మినార్ తో ఉండే లోగోను తొలగించాలని చూస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి హైదరాబాద్ కు ఎవరు వచ్చినా ముందుగా చార్మినార్ చూసేందుకు ఆసక్తి చూపిస్తారన్నారు. అలాంటి ప్రత్యేకత కలిగిన చిహ్నాన్ని తీసివేయడంపై చురకలు అంటించారు. గోల్కొండ కోట నవాబుల వైభవంగా కీర్తిస్తూ, కాకతీయ రాజ్యాన్ని కీర్తిస్తూ కవి అందెశ్రీ రాసిన ' జయ జయ హే తెలంగాణ ' పాటను రాష్ట్ర గీతంగా మార్చడంలో రేవంత్ 'వ్యంగ్యం' ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు.

పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన వాయిదా

తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో : ఆంధ్రప్రదేశ్‌లో పొత్తు రాజకీయాలపై సస్పెన్స్ కొనసాగుతోంది. టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందా ? లేదా ? అనే అంశంపై క్లారిటీ రావడం లేదు. టీడీపీతో పొత్తు ఉంటుందనే విధంగా బీజేపీ జాతీయ నాయకత్వం సంకేతాలు ఇస్తున్నప్పటికీ.. సీట్ల సర్దుబాటు వ్యవహారంపై స్పష్టత వచ్చిన తరువాతే పొత్తులపై క్లారిటీ వస్తుందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. కొన్నిరోజుల కిందట చంద్రబాబు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసి వచ్చారు. పవన్ కళ్యాణ్ కూడా హస్తిన వెళ్లి ఈ అంశంపై బీజేపీ జాతీయ నాయకత్వంతో చర్చిస్తారని ప్రచారం జరిగింది. కానీ, తాజాగా ఆయన ఢిల్లీ పర్యటనకు బ్రేక్ పడింది. పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనకు బ్రేక్ పడటంతో.. ఆయన విజయవాడ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అవుతారు. బీజేపీతో పొత్తు, సీట్ల పంపకం అంశంపై ఆయన చంద్రబాబుతో మంతనాలు జరుపుతారని సమాచారం. మరోవైపు ఏపీలో పొత్తులపై రాష్ట్ర బీజేపీ చీఫ్ పురంధేశ్వరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధిష్ఠానం సరైన టైమ్‌లో సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆమె అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్తామని తెలిపారు. పొత్తులపై ఆధారపడి తాము ఏ కార్యక్రమాలూ చేపట్టబోమని.. పార్టీ బలోపేతం కోసమే తమ ప్రయత్నాలు ఉంటాయని అన్నారు. ముందు తమ ప్రయత్నాలన్నీ బీజేపీ బలోపేతం కోసమేనంటూ వివరించారు.పొత్తులపై బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈసారి అవ్వ కావాలి.. బువ్వ కావాలి అంటే కుదరకపోవచ్చని కామెంట్ చేశారు. టీడీపీ అన్ని అంశాలపై పూర్తి స్పష్టతతో ఎన్డీఏలో చేరాల్సి ఉంటుందన్నారు. ఏరు దాటాక కూడా నావతోనే పయనం చేయాల్సి ఉంటుందని ఐవైఆర్ కృష్ణరావు వివరించారు.



మనసులను తాకిన ప్రేమకథ మళ్లీ వచ్చేస్తుంది..

తెలంగాణ వీణ , సినిమా : వాలెంటైన్ వీక్ నడుస్తుంది. ఫిబ్రవరి 7న మొదలైన ప్రేమికుల వారం.. 1 వరకు సాగుతుంది. రోజ్ డే, ప్రపోజ్ డే, చాక్లెట్ డే, ప్రామిస్ డే, టెడ్డీ డే, హగ్ డే, కిస్ డే, వాలెంటైన్స్ డే అంటూ మొత్తం 7 రోజులు ఎంతో సరదాగా జరుపుకుంటుంటారు. ఇక ప్రేమికుల కోసం ఇప్పుడు అందమైన ప్రేమకథలను మళ్లీ థియేట్రలలోకి తీసుకువస్తున్నారు. ఇక ఇప్పుడు జనాల మనసులను తాకి.. కన్నీళ్లు తెప్పించిన లవ్ స్టోరీ సీతారామం మళ్లీ రాబోతుంది. 2022లో విడుదలైన ఈ మూవీకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. హను రాఘవపూడి దర్శకత్వంలో మృణాల్ ఠాకూర్, దుల్కర్ సల్మాన్ నటించిన ఈ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులో మృణాల్, దుల్కర్ సల్మాన్ మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను కట్టిపడేసింది. అలాగే ఈ మూవీలోని సాంగ్స్ గురించి చెప్పక్కర్లేదు. ఇప్పటికీ శ్రోతలను మెస్మరైజ్ చేస్తుంటాయి.ఇదిలా ఉంటే.. సీతారామం సినిమాను ఈ వాలెంటైన్స్ డే రోజున ఫిబ్రవరి 14న మళ్లీ రిలీజ్ చేయనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. "ఈ వాలెంటైన్స్ డే మీ అందరినీ సినిమా ప్రేమ కోసం, ప్రేమ ప్రేమ కోసం తిరిగి వస్తున్నాం.. సీతారామం ఈ పిబ్రవరి 14న మళ్లీ విడుదలవుతుంది" అంటూ రాసుకొచ్చారు. దీంతో మరోసారి సీతారామం విడుదలవుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు నెటిజన్స్.ఈ సినిమాలో సచిన్ ఖేడేకర్, సుమంత్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సునీల్, భూమికా చావ్లా, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాకు విశాల చంద్రశేఖర్ అందించిన సంగీతం గురించి మాటలు చాలవు. ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ నిర్మించింది.

బీఆర్ఎస్ పాలనపై మండిపడ్డ సీఎం రేవంత్

తెలంగాణ వీణ , హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను టార్గెట్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. వరుస విచారణలతో ఉచ్చు బిగించే యత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టులు, ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై ఇప్పటికే కూపీ లాగుతున్న రేవంత్ అతి త్వరలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 64 స్థానాల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. తమ కంటే ముందు పదేళ్లపాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో జరిగిన లోపాలను ప్రజల ముందు ఉంచేందుకు సీఎం రేవంత్ రెడ్డి యత్నిస్తున్నారు. రాజకీయ విమర్శలు కాకుండా విచారణలకే ఆయన మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, తప్పిదాలను ఎత్తి చూపుతూ విచారణలకు సై అంటున్నారు రేవంత్. ఇందులో భాగంగానే మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక తెప్పించుకున్నారు. 13వ తేదీన అఖిలపక్షంతో మేడిగడ్డ సందర్శనకు వెళ్లాలని నిర్ణయించారు. దీనికి కేసీఆర్‌ను కూడా ఆహ్వానించాలని నిర్ణయించారు. మేడిగడ్డ సందర్శనకు ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరుకాకపోవచ్చని తెలుస్తోంది. కమిషన్ల కోసం కక్కుర్తి పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై దుమ్మెత్తి పోస్తోంది.వ్యవసాయంపై శ్వేత పత్రం పెట్టి కేసీఆర్ పాలనలోని వైఫల్యాలను ఎండగట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు రేవంత్. పదేండ్ల వైఫల్యాలను లెక్కలతో సహా వివరించి ప్రజల్లో దోషిగా నిలబెట్టేందుకు యత్నిస్తున్నారాయన. కేసీఆర్ పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఘోరమైన అన్యాయం జరిగిందనేది రేవంత్ వాదన. కేసీఆర్ పాలనలోని నిర్ణయాలపై విచారణకు ఆదేశించే ముందు టెక్నికల్ ఆధారాలన్నీ సమకూర్చుకుంటున్నారు రేవంత్. రాష్ట్ర నీటిపారుదల శాఖలో ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లపై రేవంత్ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంది. రామగుండం ఈఎన్సీ ఎన్ వెంకటేశ్వర్లును సర్వీస్ నుంచి తొలగించింది. ఈఎన్సీ మురళీధర్‌ను రాజీనామా చేయాల్సిందిగా ఆదేశించడంతో ఆయన రాజీనామా చేశారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కోసం అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రభుత్వ ఆదేశాలతోనే నిధులు విడుదల చేశానని ఇటీవలే చెప్పారు. మొత్తం వ్యవహారంపై రేవంత్ ప్రభుత్వం విచారణకు ఆదేశించే అవకాశాలున్నాయి. అతి త్వరలో సచివాలయం, అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహ నిర్మాణంపై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్‌చాట్‌లో తెలిపారు. విచారణకు ఆదేశించే ముందే పూర్తి వివరాలను నివేదికల రూపంలో తెప్పించుకుంటున్నారాయన.

తెల్ల రేషన్‌కార్డులు ఉన్న వారికే ఫ్రీ కరెంట్..

తెలంగాణ వీణ , హైదరాబాద్ : ఆరు గ్యారెంటీల అమలు దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలు అమలు చేసింది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోంది. చేయూత కింద రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అమలు చేసింది. ఇప్పుడు మరో రెండు గ్యారెంటీలు అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో ముఖ్యంగా.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు కసరత్తు ప్రారంభించింది.శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ పథకాల అమలకు పెద్దపీట వేశారు. మొత్తం బడ్జెట్ 2,75,891 కోట్లు కాగా.. గ్యారంటీల అమలుకు 53,196 కోట్ల నిధులు కేటాయించారు. ఇక గృహజ్యోతి స్కీం 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్ పథకం అమలు కోసం 2,418 కోట్లు కేటాయించారు. విద్యుత్ రంగానికి మొత్తంగా 16,825 కోట్ల కేటాయింపులు చేశారు.అయితే ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే తెల్లరేషన్ కార్డు తప్పకుండా ఉండాలని గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత నిచ్చారు. శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అసెంబ్లీ ఆవరణలోని తన కార్యాలయంలో సీఎం రేవంత్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం తెల్ల రేషన్‌కార్డులున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు ఈ పథకాన్ని అమలుచేస్తామన్నారు. అర్హులకు కార్డులు లేని పక్షంలో వారికి రేషన్ కార్డులు ఇస్తామన్నారు. అర్హులందరికీ ఫ్రీ కరెంట్ పథకాన్ని వర్తింపజేస్తామని ఎవరూ అపోహలకు పోవద్దని అన్నారు.అద్దె ఇళ్లలో ఉన్నవారు సైతం ఈ స్కీమ్‌కు అర్హులు అని గతంలోనే అధికారులు స్పష్టం చేశారు. 200 యూనిట్లు లోపు కరెంట్ వాడే గృహ వినియోగదారులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. ఉచిత విద్యుత్ కోసం గృహజ్యోతి కింద ప్రజాపాలనలో 81.54 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఇప్పటికే లబ్ధిదారుల డేటాపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే గృహజ్యోతి రిజిస్ట్రేషన్స్ మొదలయ్యాయి. ప్రతి నెల మొదటివారంలో 10రోజుల పాటు.. మీటర్ రీడింగ్‌తోపాటు లబ్ధిదారుల గుర్తింపు ఉంటుంది.